### విద్యార్థికి ఆర్థిక సాయం

బోథ్, నవంబర్ 4 : మండల కేంద్రానికి చెందిన మౌనిక ఇటీవల విడుదలైన బీఎస్సీ నర్సింగ్ ఫలితాల్లో ఆర్మూర్‌లోని ప్రైవేట్ కళాశాలలో సీటు సాధించింది. సోమవారం ఫ్రెండ్స్ యూత్ గణేశ్ మండలి ఆధ్వర్యంలో బొడ్డు రాజ్‌కుమార్ చేతుల మీదుగా రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### ద్విచక్రవాహనాన్ని ఢీ కొన్న టిప్పర్

ఇచ్చోడ(సిరికొండ), నవంబర్ 4 : సిరికొండ మండలం చిమన్‌గూడి గ్రామానికి చెందిన జాదవ్ అజయ్ తన ద్విచక్రవాహనంపై మండల కేంద్రానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో చిమన్‌గూడి గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో అజయ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి 108కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు.

### జెండాగూడకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తాం

భీంపూర్, నవంబర్ 4 : భీంపూర్ మండలం కామట్‌వాడ గ్రామ పంచాయతీ పరిధిలోని జెండాగూడకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని జెండాగూడ వాసులు మాజీ జడ్పీటీసీ తాటిపెల్లి రాజు ఆధ్వర్యంలో సోమవారం ఆదిలాబాద్‌లో ఎంపీ నగేశ్‌ను కలిశారు. కాంగ్రెస్ సర్కారు మారుమూల గిరిజన గ్రామాలకు కనీసం కరెంట్ సౌకర్యం కల్పించడంలో శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులతో మాట్లాడి తప్పకుండా సమస్య పరిష్కరిస్తామన్నారు. ఇక్కడ నాయకులు ఉన్నారు.

### అఖిల భారతీయ బంజారా సేవ సంఘ్ కార్యవర్గం

నార్నూర్, నవంబర్ 4 : గాదిగూడ మండల అఖిల భారతీయ బంజారా సేవ సంఘ్ నూతన కార్యవర్గాన్ని నార్నూర్ సహకార సంఘం చైర్మన్ సురేశ్ అధ్యక్షతన ఎన్నుకున్నట్లు మాజీ ఎంపీటీసీ రాథోడ్ కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు. నూతన కార్యవర్గం సభ్యులను శాలువాతో సన్మానించారు. మండలాధ్యక్షుడిగా రాథోడ్ వెంకట్రామ్, ప్రధాన కార్యదర్శిగా జాదవ్ మారుతి, ఉపాధ్యక్షుడిగా కైలాస్, సహాయ కార్యదర్శిగా రాథోడ్ సురేశ్, కోశాధికారిగా రాథోడ్ జితేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నార్నూర్ మండల ప్రధాన కార్యదర్శి రాథోడ్ దిలీప్, సంఘ పెద్దలు గోవింద్‌రావ్, బావ్ సింగ్, ధన్‌లాల్, గోకుల్ పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించాలి

నిర్మల్ అర్బన్, నవంబర్ 4 : అటవీ శాఖ ఆధ్వర్యంలో బేస్ క్యాంపులో విధులు నిర్వహిస్తున్న తమకు ప్రతి నెల వేతనాలు, పెండింగ్ మెస్ బిల్లులు చెల్లించాలని కోరుతూ వాచర్లు సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అటవీ ప్రాంతంలో ప్రాణాలకు తెగించి అటవీ సంపదను కాపాడుతున్న తమను ప్రభుత్వం పట్టించుకుని సమస్యలు పరిష్కరించాలని కోరారు.

### ఫర్టిలైజర్ దుకాణం తనిఖీ

సోన్, నవంబర్ 4: నిర్మల్ మండలం వెంగ్వాపేట్ గ్రామంలోని ఫర్టిలైజర్ దుకాణాలను మండల వ్యవసాయ శాఖ అధికారి వసంత్‌రావ్ తనిఖీ చేశారు. దుకాణంలో గల స్టాక్ వివరాలు, రైతులకు నాణ్యత కలిగిన విత్తనాలు, మందులు విక్రయించాలని సూచించారు. ఆయన వెంట ఏఈవో అంబాజీ, రైతులు ఉన్నారు.

### వందశాతం ఉత్తీర్ణత దిశగా చదివాలి

బోథ్, నవంబర్ 4 : పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత దిశగా చదవాలని సొనాల జడ్పీఎస్ఎస్ ప్రధానోపాధ్యాయుడు దేశ్‌ముఖ్ సచిన్ అన్నారు. సోమవారం నుంచి పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. ప్రతి రోజూ సాయంత్రం సబ్జెక్టుల వారీగా 4.15 నుంచి 5.15 గంటల వరకు ప్రత్యేక తరగతులు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### కుటుంబ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

ఇంద్రవెల్లి, నవంబర్ 4 : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కుటుంబ సర్వేతో పాటు కులగణన సర్వేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారథి కళా బృందం సభ్యులు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వారసంతలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి కుటుంబ సర్వే, కులగణన సర్వే, దోమల నివారణ, డ్రగ్స్ నిర్మూలన, ఆరు గ్యారెంటీలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు నగేశ్, వెంకట్‌రావ్, రాజలింగు, రవి, రమేశ్, గోవింద్‌రావ్, మురళి, శంకర్‌రావ్, రాజు, శ్రీలత, నర్సమ్మ పాల్గొన్నారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక

ఎదులాపురం, నవంబర్ 4 : ఆదివాసీ పర్ధాన్ సమాజాన్ని పీటీజీగా గుర్తించాలని అఖిల భారతీయ పర్ధాన్ సమాజ్ జనజాతి ఉద్యన్ సంఘటన్ జాతీయ ఉపాధ్యక్షుడు సిడాం రాంకిషన్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్‌లోని బస్టాండ్ ఎదుట గల హీరాసుక ఆలయం వద్ద సంఘటన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనంతరం జిల్లా, పట్టణ, రాష్ట్ర, మహిళ ప్రతినిధులుగా ఎన్నికైన వారికి నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మెస్రం శంకర్, మాధవ్, శివకుమార్, అనిత్ పాల్గొన్నారు.

### ఐటీడీఏ అధికారులపై చర్యలు తీసుకోవాలి

ఎదులాపురం, నవంబర్ 4: బేలలోని ఎంపీడీవో కార్యాలయంలో దండారీ చెక్కులు గురువారం పంపిణీ చేసిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి సీతక్క బ్యానర్ ఎందుకు పెట్టలేదని ఐటీడీఏ ఎస్ఈఆర్పీ మడావి శంకర్, సైద్‌పూర్ స్కూల్ కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ యాదవ్ గణేశ్‌ను అడిగితే దురుసుగా ప్రవర్తించారని నాయకులు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ రాజర్షి షాను కలిసి అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ విచారణ చేసి వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ బేల మండలాధ్యక్షుడు ఫైజుల్లాఖాన్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేశ్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ రాందాస్‌నాయ్క్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వామన్, బ్లాక్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సంజయ్ గుండావార్, కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు ఘన్‌శ్యాం, ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు చంద్రకాంత్, మాజీ సర్పంచ్ శంకర్ ఉన్నారు.

### క్రీడలు మానసికోల్లాసానికి దోహదం

భైంసా, నవంబర్ 4 : క్రీడలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని నారాయణ పాఠశాల ఏజీఎం ప్రసాద్ అన్నారు. సోమవారం నారాయణ పాఠశాలలో ఎంపీఎల్ క్రీడలు ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రభు, డీన్ గంగాధర్, ఏవో గజ్జారాం, విద్యార్థులు పాల్గొన్నారు.

### తనిఖీల రికార్డును కలెక్టర్‌కు సమర్పించిన కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సభ్యులు

నిర్మల్ చైన్‌గేట్, నవంబర్ 4: నిర్మల్ జిల్లా ప్రభుత్వ ప్రధాన దవాఖానల రికార్డుల తనిఖీల రిపోర్టును సోమవారం జిల్లా కలెక్టర్‌కు కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సభ్యులు సమర్పించారు. ప్రధాన దవాఖానలలో అవినీతి జరిగిందని చర్యలు చేపట్టాలని కోరుతూ సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సభ్యులు మంథని శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌స్వామి, గొర్రె లింగన్న, ఫణిందర్‌కుమార్, ఇమ్రాన్‌ఖాన్, భోజన్న, నితీశ్‌కుమార్ ఉన్నారు.

### పెండింగ్ వేతనాలు వెంటనే మంజూరు చేయాలి

నిర్మల్ చైన్‌గేట్, నవంబర్ 4 : రాష్ట్రంలోరి అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లకు వెంటనే వేతనాలు చెల్లించాలని సోమవారం అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.



జామిడిలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్

నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనం

# తీరనున్న రైతుల కష్టాలు..

నమస్తే ఎఫెక్ట్

తాంసి, నవంబర్ 4 : మండలంలో కరెంట్ కోతలతో ఇబ్బందులు 'కాలువ నీరే రైతుల కష్టాలను తీర్చే' నమస్తే తెలంగాణలో అక్టోబర్ 7న ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. జామిడి గ్రామ రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, ట్రాన్స్‌ఫార్మర్ బిగించారు. దీంతో గ్రామ రైతులకు అధిక లోడ్ కష్టాలు తీరి నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యలు అధికారులు పట్టించుకొని పరిష్కరించే దిశగా కృషి చేసిన నమస్తే తెలంగాణకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

## రైతు భరోసాను వెంటనే అమలు చేయాలి

ఎదులాపురం, నవంబర్ 4 : రైతు భరోసా వెంటనే అమలు చేయాలని అఖిల పక్ష రైతు సంఘం అధ్యక్షుడు బండి దత్తాత్రి డిమాండ్ చేశారు. సోమవారం ఆదిలాబాద్‌లోని సుందరయ్య భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంటకు గిట్టుబాటు ధర రాక రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. పత్తి పంటకు మద్దతు ధర కల్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రోకండ్ల రమేశ్, కొండా రమేశ్, లోకారి పోశెట్టి, లక్ష్మణ్, రాఘవులు, వెంకట్‌నారాయణ, జగన్, సురేశ్, స్వామి పాల్గొన్నారు.

## కుటుంబ పెద్ద కోల్పోయిన లోటు తీరనిది

ఎదులాపురం, నవంబర్ 4 : బోథ్ పోలీస్ స్టేషన్ చెందిన హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి స్వగ్రామమైన మావల మండలం వాఘపూర్‌లో గుండెపోటుతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎస్పీ గౌష్ ఆలం సోమవారం వాఘపూర్‌లో జరిగే అంత్యక్రియల్లో పాల్గొని పార్థివ దేహానికి పుష్పగుచ్ఛాలతో నివాళులర్పించి, ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కుటుంబంలో పెద్ద దిక్కును కోల్పోయిన లోటు ఎప్పటికీ తీరనిదని, జిల్లా పోలీసు యంత్రాంగం అందుబాటులో ఉంటూ సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పరంగా వచ్చే లబ్ధి త్వరగా చేకూర్చే విధంగా కృషి చేస్తానని తెలిపారు. కుటుంబ సభ్యులకు తక్షణ సహాయం కింద అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.20 వేలు అందజేశారు. రమణారెడ్డికి భార్య, కూతురు వివాహిత, కుమారుడు ఉన్నారు. ఇక్కడ ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, బోథ్ సీఐ రమేశ్, ఎస్ఐలు ప్రవీణ్, అప్పారావ్, అశోక్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్, బోథ్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

## 6న ఆదిలాబాద్‌లో బంజారుల సమావేశం

నార్నూర్, నవంబర్ 4 : ఆదిలాబాద్‌లో ఈ నెల 6వ తేదీన బంజారా సమాజ సమావేశం నిర్వహించనున్నట్లు అఖిల భారతీయ బంజారా సేవ సంఘ్ జిల్లా అధ్యక్షుడు జాదవ్ రెడ్డి నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బంజారులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ఆ సంఘం రాష్ట్రీయ అధ్యక్షుడు రాములు నాయక్ హాజరుకానున్నారన్నారు. జిల్లాలోని నలుమూల ప్రాంత సమాజ పెద్దలు, మేధావులు, ఉద్యోగస్తులు, బంజారా అనుబంధ సంఘాల నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నార్నూర్ సహకార సంఘం చైర్మన్ సురేశ్, మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్, జేసీఎస్ మాజీ చైర్మన్ రాథోడ్ ఉత్తమ్, బంజారా సేవ సంఘ్ మండలాధ్యక్షుడు జాదవ్ చంద్రశేఖర్, పెసా చట్టం కోఆర్డినేటర్ రాథోడ్ సికిందర్, మాజీ ఉప సర్పంచ్ చౌహాన్ మహేందర్, మాజీ ఎంపీటీసీ రాథోడ్ రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ

ఎదులాపురం, నవంబర్ 4: ఆదిలాబాద్‌కు చెందిన మాజీ జర్నలిస్ట్, గోపాలం చిత్ర దర్శకుడు షఫీ ఉల్లా ఖాన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను సోమవాం మాజీమంత్రి జోగు రామన్న పరామర్శించారు. ఆయన వెంట నాయకులు మెట్టు ప్రహ్లాద్, రోకండ్ల రమేశ్ ఉన్నారు.

## పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఇంద్రవెల్లి, నవంబర్ 4: మండల కేంద్రంలోని మిత్తల్ జిన్నింగ్ మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ కార్యదర్శి దేవన్న, సీపీవో నరేశ్, ఏవో గణేశ్, ఏఈవోలు వీరా, వివేక్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ముకాడే ఉత్తమ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ మసూద్, నాయకులు పాల్గొన్నారు.

## ఆదివాసీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ఆదివాసీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. కేస్లాపూర్ గ్రామంలోని రైతు వేదికలో 40 గుస్సాడీ దండారీ బృందాలకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## కృత్రిమ మేధస్సుపై విద్యార్థులకు అవగాహన

బాసర, నవంబర్ 4 : బాసర ఆర్జీయూకేటీలో సోమవారం ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులకు కృత్రిమ మేధస్సుపై అవగాహన సదస్సు ప్రారంభమైనట్లు ట్రిపుల్ ఐటీ అధికారులు తెలిపారు. ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి గోవర్ధన్ సహకారంతో నేషనల్ ఇన్స్‌ట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ రీసర్చ్ చండీఘడ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ సదస్సు వారం రోజుల పాటు జరుగనుందని ట్రిపుల్ ఐటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణదీర్ సాగి తెలిపారు. కార్యక్రమంలో వివిధ విభాగాల ఆధ్యాపకుల, విద్యార్థులు పాల్గొన్నారు.

## శాంపిల్స్‌ను ఎప్పటికప్పుడు నిర్ధారణ చేయాలి

ఎదులాపురం, నవంబర్ 4: ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో గల మలేరియా ల్యాబ్‌ను జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ శ్రీధర్ సోమవారం తనిఖీ చేశారు. కేంద్రంలోని జ్వరం కేసులకు సంబంధించిన నమూనాలను, సేకరణ తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. రికార్డులను పరిశీలించి శాంపిల్స్‌ను ఎప్పటికప్పుడు నిర్ధారణ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ల్యాబ్‌టెక్నీషియన్ రమణాచారిని, వైద్య సిబ్బంది ఉన్నారు.

## నేటి నుంచి రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలు

ఉట్నూర్, నవంబర్ 4: ఉట్నూర్ ఐటీడీఏ వేదికగా నేటి నుంచి మూడు రోజుల పాటు రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలు జరగనున్నాయి. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. మంగళవారం ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జులు అధికారికంగా ప్రారంభించనున్నారు.

## చైర్మన్ పదవి మాదిగలకే కేటాయించాలి

కుభీర్, నవంబర్ 4: కుభీర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి మాదిగలకే కేటాయించాలని అన్నబావు సాఠే సేవా సమితి, ఎమ్మార్పీస్ నాయకులు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. సోమవారం కుభీర్‌లో నిర్వహించిన సమావేశంలో మాదిగ, ఎమ్మార్పీస్ నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో అన్నబావు సాఠే సేవా సమితి జిల్లా అధ్యక్షుడు నామత్కర్ దిగంబర్, ఎమ్మార్పీస్ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు గోరేకర్ కాశీనాథ్, నగేశ్ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

సారంగాపూర్, నవంబర్ 4 : మండలంలోని స్వర్ణ, పొట్యా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం మార్కెట్ కమిటీ వైర్మన్ అబ్దుల్‌హది ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగరావ్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

### వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య

నిర్మల్ అర్బన్, నవంబర్ 4: నిర్మల్‌లోని బంగల్‌పేట్ సమీపంలోని మామిడి తోటలో కుంటాల మండలానికి చెందిన లక్ష్మణ్ (28) రెండు రోజుల క్రితం మహాలక్ష్మీ వాడలో ఉంటున్న వారి అత్తగారింటికి వచ్చాడు. లక్ష్మణ్ వ్యక్తిగత కారణాలతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. మృతునికి భార్య, ఐదేళ్ల కుమారుడు ఉన్నాడు.

### కడుపు నొప్పి భరించ లేక వివాహిత ..

దస్తురాబాద్, నవంబర్ 4 : కడుపు నొప్పి భరించలేక పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన దస్తురాబాద్ మండలంలోని మున్యాల గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం...మున్యాల గ్రామానికి చెందిన శృతి (23) శనివారం ఉదయం పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గుర్తించి ఓ ప్రైవేట్ దవాఖానాలో చికిత్సనందించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### తైక్వాండో, కరాటే సభ్యుల మధ్య గొడవ

ఎదులాపురం, నవంబర్ 4: ఆదిలాబాద్‌లోని డైట్ కళాశాల ఆవరణలో సోమవారం సాయంత్రం తైక్వాండో కరాటే సభ్యుల మధ్య మాటమాట పెరిగి గొడవకు దారి తీసింది. సోమవారం ఉదయం కలెక్టర్ రాజర్షి షాను కలిసి కరాటే సభ్యులు తైక్వాండో సభ్యులపై ఫిర్యాదు చేశారు. ఇది మనసులో ఉంచుకున్న తైక్వాండో సభ్యుడికి చెందిన శిష్యుడుతో కరాటే సభ్యులకు రెచ్చగొట్టే మాటలు అనడంతో ఇరువురి మధ్య మాటమాట పెరిగి గొడవ చేసుకున్నారు. దీంతో డయల్ 100కు సమాచారం రావడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఇరువురిని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ విషయాన్ని వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్‌ను ప్రశ్నించగా గొడవ జరిగినట్లు డయల్ 100కు కాల్ వచ్చిందన్నారు.

### హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

నిర్మల్ చైన్‌గేట్, నవంబర్ 4 : కన్నతండ్రిని హత్య చేసిన వ్యక్తికి ప్రిన్సిపాల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ జీవిత ఖైదు విధించినట్లు ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. ఆమె తెలిపిన వివరాల మేరకు.. నిర్మల్ పట్టణం పింజరి గుట్ట కాలనీకి చెందిన అప్పాల గణపతికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమార్తెల పెళ్లిల్లు చేశాడు. పెద్ద కుమారుడు అభిలాష్ ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నాడు. చిన్నకుమారుడు అప్పాల అవినాశ్(30) ఏ పని చేయకుండా తల్లిదండ్రులపై ఆధారపడ్డాడు. కొద్ది రోజులుగా తనకు వివాహం చేయాలని తన తండ్రి ఐన గణపతిని బెదిరిస్తున్నాడు. పెద్ద కుమారునికి పెళ్లి చేసినాకే వివాహం చేస్తామని చెప్పినా వినకుండా కక్ష పెంచుకున్నాడు. 13 జూన్ 2022న తన తండ్రితో గొడవ పడి కత్తితో దాడి చేయగా గణపతి ఇంటి నుంచి బయటకు వచ్చి పడిపోయాడు. సంఘటన చూసిన స్థానికులు వచ్చి ఆపడానికి ప్రయత్నించగా వారిని బెదిరించి ఇంట్లోకి వెళ్లి కొడవలి తీసుకువచ్చి కిరాతకంగా చంపాడు. మృతుని అల్లుడు బోమెడ రాజు ఫిర్యాదు మేరకు అప్పటి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. నేరరుజువు కావడంతో నిందితుడికి న్యాయమూర్తి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన వినోద్‌రావు, అప్పటి ఇన్‌వెస్టిగేషన్ అధికారి శ్రీనివాస్, కోర్టు లైజనింగ్ అధికారి ఎస్ఐ దల్లుసింగ్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ అంకుశ్, కానిస్టేబుళ్లను ఎస్పీ అభినందించారు.

### రైతులకు మద్దతు ధర కల్పించేందుకు కొనుగోలు కేంద్రాలు

భైంసా, నవంబర్ 4 : మార్కెట్‌లో పత్తి రైతుకు మద్దతు ధర కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ద్వారా సీసీఐ కొనుగోళ్లు ప్రారంభించామని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. సోమవారం భైంసాలోని మార్కెట్ యార్డులో సీసీఐ కొనుగోళ్లు ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, వైస్ చైర్మన్ ఫారూఖ్ అహ్మద్, మార్కెట్ కార్యదర్శి పురియా, అధికారులు శ్రీనివాస్, నాయకులు బామ్ని రాజన్న, ఓం ప్రకాశ్ లడ్డా, పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

### ముథోల్ ఎమ్మెల్యేను కలిసిన మత్స్యకారులు

భైంసా, నవంబర్ 4: తానూర్ మండలం, భైంసా మండలానికి చెందిన మత్స్యకారులు సోమవారం భైంసాలోని నివాసంలో ఎమ్మెల్యే రామారావు పటేల్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి తనవంతుగా పాటుపడతానన్నారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ సత్కరించిన వారిలో ఆనంద్, రాజు, శంకర్, గంగాధర్, నాగన్న, సాయి, లక్ష్మణ్ ఉన్నారు.

### జిల్లా విద్యాశాఖ అధికారిగా నాగజ్యోతి

నిర్మల్ చైన్‌గేట్, నవంబర్ 4 : నిర్మల్ జిల్లా విద్యాధికారిగా నాగజ్యోతిని నియమిస్తున్నట్లు రాష్ట్ర అసిస్టెంట్ డైరెక్టర్ సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ డీఈవోగా పని చేసిన రవీందర్‌రెడ్డిని మహబూబాబాద్ జిల్లా డైట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. కాగా నిర్మల్ డీఈవోగా బదిలీపై వస్తున్న నాగజ్యోతి నిజామాబాద్ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్, డీఈవోగా పని చేశారు.

### రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఇంద్రవెల్లి, నవంబర్ 4: ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ గ్రామానికి చెందిన వ్యాపారి గోపాల్ ద్విచక్రవాహనంతో మండలకేంద్రానికి వస్తుండగా, వెనుక నుంచి అతి వేగంతో వస్తున్న బోలెరో వాహనం ఢీ కొట్టింది. వ్యాపారి గోపాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బొలేరో వాహనం రోడ్డుపై బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వాహనంలో ఉన్న మహారాష్ట్రకు చెందిన ఇద్దరికి స్వల్ప గాయాలతో బయటపడినట్లు స్థానికులు తెలిపారు. తీవ్ర గాయాలైన గోపాల్‌ను మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎస్ఐ సునీల్ సంఘటన స్థలానికి చేరుకుని జరిగిన రోడ్డు ప్రమాదం గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

### ఆలయ అభివృద్ధికి సహకారం

కుంటాల, నవంబర్ 4 : కుంటాల మండలం కల్లూరు గ్రామ దత్తసాయి మందిర ఆవరణలో రూ.45 లక్షల సీజీఎఫ్ నిధులతో కళాతోరణం, గోడ పనులను మంగళవారం ఎమ్మెల్యే రామారావు పటేల్ ప్రారంభించారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో భైంసా ఏఎంసీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

### ప్రతి కుటుంబాన్ని సమగ్ర సర్వే నిర్వహించాలి

తలమడుగు, నవంబర్ 4: కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ రాజమోహన్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించిన ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాల్లో తహసీల్దార్ మాట్లాడుతూ ఈ నెల 6 నుంచి ప్రారంభమయ్యే సమగ్ర కుటుంబ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సర్వేలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా అందుబాటులో ఉండే సూపర్‌వైజర్లకు, మండల స్థాయి అధికారులను సంప్రదించాలన్నారు. ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో వెంకట్‌రావ్ పాల్గొన్నారు.

## డీఎంహెచ్‌వోకు శుభాకాంక్షలు

డీఎంహెచ్‌వోకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైద్యులు

ఎదులాపురం, నవంబర్ 4 : ఇటీవల ఆదిలాబాద్ డీఎంహెచ్‌వోగా రాథోడ్ నరేందర్ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం (టీపీహెచ్‌డీఏ) తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్ అసోసియేషన్ తరపున డీఎంహెచ్‌వోను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కలి